క్లుప్తంగా

సుబ్బారెడ్డితో జెడ్పీ చైర్‌పర్సన్ భేటీ



వైవీ సుబ్బారెడ్డితో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

కొమ్మాది: రుషికొండలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. విజయదశమి నాడు విశాఖ నుంచి పరిపాలన ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఆమెకు అభినందనలు తెలిపారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

రామ్ధారీ సింగ్ దినకర్‌కు ఘన నివాళి



మాట్లాడుతున్న అధ్యాపకురాలు సుగుణ

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ హిందీ అభ్యుదయ కవి రామ్ధారీ సింగ్ దినకర్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ధారీ సింగ్ చిత్ర పటానికి కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, గజపతినగరం డిగ్రీ కళాశాల హిందీ అధ్యాపకురాలు బి.సుగుణ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సుగుణా మాట్లాడుతూ జాతీయ అభ్యుదయ కవిగా రామ్ధారీ సింగ్ దినకర్ తన రచనలతో చైతన్యాన్ని నింపారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల హిందీ విభాగం అధ్యాపకులు బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పురంధేశ్వరి

ఎంవీపీకాలనీ: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రారంభించారు. మోదీ జన్మదినం సందర్భంగా అక్టోబర్ 2వ తేదీ వరకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రక్తదానం చేసిన పలువురు యువకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగేంద్ర, రవీంద్ర, సురేంద్ర పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అల్లిపురం : అన్నదమ్ముల మధ్య గొడవలో తమ్ముడు ప్రాణాలు కోల్పోయిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం గత ఆదివారం జెండాచెట్టువీధిలో కారి లక్ష్మణ్ తన కుమార్తె మెచ్యూర్ ఫంక్షన్ నిర్వహించాడు. ఫంక్షన్‌కు పిలవటంతో అతని సోదరుడు కారి రాజేష్ గాజువాక జోగవానిపాలెం నుంచి తన కుటుంబంతో సహా వచ్చాడు. మరో సోదరుడు జెండాచెట్టువీధిలోనే ఉంటున్న కారి మహేష్ తన కుటుంబంతో కలిసి వచ్చాడు. ఫంక్షన్ అయిపోయిన తర్వాత రాజేష్, మహేష్ ఇద్దరు మద్యం సేవించారు. ఆ సమయంలో వారిద్దరి మధ్య మాటమాట పెరగటంతో వివాదం పెరిగిపోయింది. ఈ క్రమంలో రాజేష్ తన బండిలో గల కత్తితో మహేష్‌ను బలంగా పొడవటంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో బంధువులు అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. శనివారం మహేష్ చికిత్స పొందుతూ మరణించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరిలోవ పోలీసు స్టేషన్‌కు మహర్దశ

- త్వరలో నూతన భవనాలు
- రెండు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు మోక్షం కలగనుంది. ఇరుకు గదుల్లో పోలీసుల సేవలకు ఫుల్ స్టాప్ పడనుంది. నిలిచిపోయిన భవన నిర్మాణాలను నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. మళ్లీ పనులు ప్రారంభించి రెండు నెలల్లో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. దీంతో త్వరలో ఇక్కడ పోలీసులు విశాలమైన భవనంలో సేవలు అందించనున్నారు. ఆరిలోవ పోలీసు స్టేషన్ నిత్యం ఫిర్యాదు దారులతో రద్దీగా ఉంటుంది. దీంతో ఇరుకు గదుల్లో అటు పోలీసులు, ఇటు ఫిర్యాదుదారులు ఇబ్బంది పడుతున్నారు. సిబ్బందికి సౌకర్యాలు కూడా అంతంత మాత్రంగా ఉన్నాయి. నాలుగున్నరేళ్లుగా నూతన భవనాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో అధికారులు స్పందించారు.

విమ్స్ ఆవరణలో..

కొత్తగా స్టేషన్ నిర్మాణం కోసం విమ్స్ ఆవరణలో ఐదేళ్ల క్రితం ఎకరాస్థలం కేటాయించారు. భవన నిర్మాణాలకు రూ.6 కోట్లు కేటాయించారు. 2019లో పోలీస్ స్టేషన్ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆధునిక హంగులతో మూడు అంతస్తులు నిర్మాణం చేపట్టాలని భావించారు. ఆరిలోవకు పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్‌తో పాటు తూర్పు ఏసీపీ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్లు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. అదే ఆలోచనతో ఆఘమేఘాలపై పనులు చేపట్టి రెండు ఫ్లోర్లు వేశారు. అక్కడ నుంచి



విమ్స్‌లో ఆవరణలో మధ్యలో నిలిచిపోయిన కొత్త భవన నిర్మాణం

భవన నిర్మాణాలవైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. నాటి నుంచి నేటి వరకు ముగ్గురు కమిషనర్లు వచ్చి వెళ్లారు కానీ ఈ భవన నిర్మాణాలను పట్టించుకోలేదు. త్వరలో విశాఖ పరిపాలనా రాజధాని కానుండడంతో ఉన్నతాధికారుల నుంచి సూచనలు రావడంతో పోలీస్ అధికారులు ఈ భవన నిర్మాణాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా డీసీపీ శ్రీనివాసరావు శుక్రవారం పనులను పరిశీలించారు. తొందరగా పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో పనులు పునఃప్రారంభం కానున్నాయి.

పరిధి విశాలం..

ప్రస్తుతం ఇక్కడ సీఐ, నలుగురు ఎస్ఐలతో పాటు ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోం గార్డులతో కలిపి సుమారు 50 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఈ పోలీసు స్టేషన్ పరిధిలో అటు రుషికొండ, గీతం వర్సిటీ, ఎండాడ, సాగర్‌నగర్, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం ప్రాంతాలు, ఇటు హనుమంతవాక, డెయిరీ ఫారం, రవీంద్రనగర్, ఆరిలోవ, విశాఖ కేంద్రకారాగారం, పైనాపిల్‌కాలనీ, దారపాలెం వరకు ఉంది. ఇటు జాతీయరహదారిపై ఎండాడ కూడలి నుంచి జూ పార్కు విశాఖవ్యాలీ స్కూల్ కూడలి మీదుగా డెయిరీఫారం, హనుమంతవాక వరకు, మరోపక్క బీచ్‌రోడ్డులో తెన్నేటి పార్కు నుంచి జోడుగుళ్లపాలెం, జూ, సాగర్ గేట్, సాగర్‌నగర్ మీదుగా గీతం వర్సిటీ దాటి చినరుషికొండ కూడలి వరకు దీని పరిధి విస్తరించారు. ఇంత విశాలమైన పరిధిలో పనిచేయడానికి అవసరమైన సిబ్బంది సరిపడగా ఉన్నప్పటికీ విశాలమైన భవనం లేదు. ఒకే గదిలో ఇంతమంది పోలీసులు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. సీఐ క్యాబిన్, పక్కనే ఎస్.ఐలు కూర్చోవడానికి టేబుళ్లు, కంప్యూటర్ ఆపరేటర్, రైటర్, రికార్డులు రాసేవారు ఇలా అంతా ఇరుక్కు గదుల్లోనే సర్దుకోవాల్సి వస్తోంది. ఈ భవన నిర్మాణం పూర్తయితే ఈ సమస్యకు మోక్షం కలగనుంది.

త్వరలోనే పూర్తి చేస్తాం



హనుమంతవాక వద్ద విమ్స్ ఆవరణలో కేటాయించిన స్థలంలో ఆరిలోవకు పోలీస్ స్టేషన్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులు కొన్నాళ్లుగా నిలిచిపోయాయి. భవన నిర్మాణాన్ని డీసీపీ కె. శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. పనులు పునఃప్రారంభించాలని, రెండు నెలల్లో భవనాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయమై సీపీతో సంప్రదిస్తామన్నారు. పోలీస్ స్టేషన్ నూతన భవనం త్వరలో అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నాం.

–సోమశేఖర్, ఆరిలోవ సీఐ

కష్టతరమైన నిర్మాణాలు భారత్‌కే సాధ్యం

ఏయూక్యాంపస్: కష్టతరమైన నిర్మాణాలను భారత్ సాకారం చేస్తోందని ఐఐటీ కాన్పూర్ విజిటింగ్ ప్రొఫెసర్ డాక్టర్ మంత్రాల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో విద్యార్థులనుద్దేశించి చీనాబ్ బ్రిడ్జి నిర్మాణంపై ప్రసంగించారు. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన రైల్వే వంతెనగా చీనాబ్ బ్రిడ్జి నిలుస్తుందన్నారు. దీని నిర్మాణంలో తాను భాగస్వామ్యమయ్యానన్నారు. దీని ప్రత్యేకతలను వివరించారు. అదే విధంగా జమ్ము కాశ్మీర్‌లోని బక్కల్, కౌరీ ప్రాంతాల మధ్య నిర్మించిన బ్రిడ్జి ప్రత్యేకతలను విద్యార్థులకు వివరించారు. ఈ వంతెన పేలుడు, భారీ గాలులు, భూకంపాలను సైతం తట్టుకునే విధంగా నిర్మించారన్నారు. కార్యక్రమంలో ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్ వైజాగ్ చాప్టర్, ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ విశాఖ చాప్టర్‌సభ్యులు, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ ఏయూ వీసీ ప్రసాద రెడ్డితో మర్యాదపూర్వకంగా కార్యాలయంలో భేటీ అయ్యారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి, విద్యార్థులకు ఉపయుక్తంగా చేపడుతున్న నూతన సంస్కరణలను డాక్టర్ శ్రీనివాస్ అభినందించారు. అనంతరం వర్సిటీ తరఫున శ్రీనివాస్‌ని సత్కరించారు. కార్యక్రమంలో ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య సీఎస్‌వీ సత్యనారాయణ రెడ్డి, ఆచార్య డీఎస్ఆర్ మూర్తి, ఆచార్య కె.శ్రీనివాస రావు, ఆచార్య కె.రాంబాబు, ఆచార్య పీవీవీ సత్యనారాయణ, ఆచార్య ఎస్.ఆదిశేషు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

మేనేజర్ల నిర్ణయాలతో సంస్థల విజయం

ఏయూక్యాంపస్: ఆంధ్ర యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో శనివారం 'ఫ్యూచర్ ఆఫ్ ది మేనేజ్మెంట్ అండ్ ఫ్యూచర్ సీఈవోలు' అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. కార్యక్రమానికి విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి అధ్యక్షత వహించారు. చార్టెడ్ అకౌంట్ నాగదేసి శామ్యూల్ హాజరై విద్యార్థులు ఉద్దేశించి భవిష్యత్తు యాజమాన్యం- మేనేజర్ల బాధ్యతలు గూర్చి మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచీకరణలో మార్కెట్ నిర్వహణ రోజురోజుకీ మార్పులకు లోనవుతున్న విధానం, టెక్నాలజీ, ఆర్థికపరమైన అంశాలు, మార్కెట్ వ్యాపార నిర్వహణ పద్ధతులను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయన్నారు. టెలిఫోన్ నుంచి ఇంటర్నెట్, హ్యూమన్ ఇంటిలిజెంట్స్ నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరివర్తన చెందుతూ ఉన్న పరిస్థితులలో విధి నిర్వహణలో మేనేజర్లు తీసుకునేటువంటి నిర్ణయాలు వల్ల మాత్రమే సంస్థ పనితీరు, సక్సస్ ఆధారపడి ఉంటాయని చెప్పారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని అదే సమయంలో టెక్నాలజీపై ఆధారపడి నిర్వహణ చేయకూడదన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బి.సుబ్బయ్య, డాక్టర్ ప్రభాకర్, బుజ్జిబాబు, సురేష్ పరిశోధకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తను విభాగం తరుపున సత్కరించారు.



చార్టెడ్ అకౌంటెంట్ ఎస్.శామ్యూల్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు

సంపత్ వినాయగర్‌ను దర్శించుకున్న మంత్రి అమర్‌నాథ్

సీతమ్మధార : శ్రీ వ్యాస మహా భారత లిఖిత గణపతి అలంకరణలోని ఆశీలమెట్ట శ్రీ సంపత్ వినాయగర్‌ను శనివారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు గురుసు గోవింద్‌రెడ్డి మంత్రికి స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకుడు మోహన్‌స్వామి మంత్రి గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంపత్ వినాయకుడి చిత్రపటాన్ని మంత్రికి ప్రధాన అర్చకుడు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్. చోళన్ పాల్గొన్నారు.



సంపత్ వినాయగర్‌కు పూజలు చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ఘనంగా సెయింట్ జోసెఫ్ కళాశాల స్నాతకోత్సవం

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆధ్వర్యంలో శనివారం కళాశాల స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన దాదాపు 300 మంది విద్యార్థినులు ఉపకులపతి చేతుల మీదుగా పట్టాలు, పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ కాన్వకేషన్ నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఉత్తమ విద్యతో పాటు విద్యార్థినుల సంరక్షణ బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తున్న కళాశాల యాజమాన్యాన్ని కొనియాడారు. విద్యార్థినులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేస్తున్న కళాశాల అధ్యాపకులను అభినందించారు. హిందీ విభాగాధిపతి, ప్రెస్ ఇన్‌చార్జి పి.కె. జయలక్ష్మి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో పలు విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న విద్యార్థిని

1,2 తేదీల్లో మిరాకిల్ మెగా టాలెంట్ హంట్

డాబాగార్డెన్స్ : గాంధీ జయంతి పురస్కరించుకుని చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీసేందుకు అక్టోబర్ 1, 2 తేదీల్లో మిరాకిల్ మెగా టాలెంట్ హంట్ నిర్వహించనున్నట్టు మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షకీల్ మాట్లాడుతూ ఆ రెండు రోజులు ఉదయం 9.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీ వేదికగా పోటీలుంటాయన్నారు. ఫ్యాన్సీ డ్రెస్‌తో పాటు మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, డ్రాయింగ్, పెయింటింగ్, గెటప్స్, కోలాటం, ట్రెడిషనల్ డ్రెస్, ఫోక్ డ్యాన్స్ పోటీలు ఉంటాయన్నారు. అన్ని వయసుల వారు పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు 9966485335 నంబరులో సంప్రదించాలన్నారు.

పలు చోట్ల రక్తదాన శిబిరాలు



అవయవదానం కోసం నమోదు చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న డీఎంహెచ్‌వో

మహారాణిపేట: ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పర్యవేక్షణలో నగరంలో పలు చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం(భవాని గార్డెన్స్)లో నిర్వహించి 14 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. సిరిపురంలోని వరుణ్ మోటార్స్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ సెంటర్ 50 యూనిట్ల బ్లడ్ సేకరించారు. బీజేపీ యూత్ బీజేపీ పార్టీ ఆఫీస్‌లో గవర్నమెంట్ విక్టోరియా ఆస్పత్రిలో 20 యూనిట్స్ బ్లడ్ సేకరించారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ మెడికల్ స్టూడెంట్స్, కేజీహెచ్ బ్లడ్ సెంటర్ ద్వారా 50 యూనిట్లు, వన్‌టౌన్‌లో విశాఖ బ్లడ్ సెంటర్ ద్వారా 13 యూనిట్లు, హుకుంపేట ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్ ద్వారా 35 యూనిట్ల బ్లడ్ సేకరించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి వారి కార్యాలయ సిబ్బంది 9 మంది అవయవదానం చేసేందుకు అంగీకారం తెలిపగా..వారికి ధ్రువపత్రాలు అందజేశారు.

ప్రకృతి పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలి

ఏయూక్యాంపస్: ప్రకృతి పరిరక్షణలో యువతను భాగస్వామిగా చేయాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహిస్తున్న పర్యావరణ శాస్త్ర ఐడీఆర్‌సీ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ కృష్ణమోహన్ మాట్లాడుతూ మానవ అవగాహన రాహిత్యం, తప్పిదాలతో పర్యావరణానికి కొంతమేర నష్టం జరుగుతోందని చెప్పారు. నేడు పర్యావరణ విద్యను పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు ఒక అంశంగా అందించడం జరుగుతోందని చెప్పారు. నేటి తరం విద్యార్థులకు అవసరమైన జ్ఞానాన్ని అందించడంతో పాటు వారి సమగ్ర వికాసానికి ఉపయోగపడే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. పలు ప్రధాన నగరాల్లో పెరుగుతున్న జనాభా కాలుష్యం కారణంగా గాలి నాణ్యత ప్రమాణాలు పడిపోతున్నాయని, వీటికి తగిన పరిష్కారాలను నిపుణులు సూచించాలని కోరారు. హెచ్ఆర్‌డీసీ కేంద్రం సంచాలకులు ఆచార్య టీవీ కృష్ణ మాట్లాడుతూ అధ్యాపకులకు అధునాతన బోధన నైపుణ్యాలపై అవగాహన కల్పించామన్నారు. పర్యావరణహితంగా విద్యార్థులను తయారు చేయాలని ఆచార్యులకు సూచించారు. శిక్షణ తరగతుల సమన్వయకర్త ఆచార్య ఉదయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు గ్రీన్ అంబాసిడర్లుగా నిలవాలని కోరారు. ఇక్కడ నేర్చుకున్న జ్ఞానాన్ని విద్యార్థులకు చేరువ చేయాలని చెప్పారు. సహజ వనరుల వినియోగం తగ్గించడం, వృథా నియంత్రించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కేంద్రం గౌరవ ఆచార్యులు ఆచార్య ఎస్.ఏ.డి పాల్ తదితరులు ప్రసంగించారు.



ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్

మర్యాదపూర్వక కలయిక

డాబాగార్డెన్స్: నూతనంగా ఎన్నికైన జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డిని ప్రభుత్వ వసతి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు గొంప చంద్రమౌళి ఎన్నికైన కార్యవర్గ సభ్యులను వైవీకి పరిచయం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు తక్షణం చెల్లించాలని కోరారు. దీనికి వైవీ సానుకూలంగా స్పందించి త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు అధ్యక్షుడు గొంప చంద్రమౌళి తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ రొంగలి జగన్నాథం, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు, కన్వీనర్ రాజాన వెంకట్రావు, కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షుడు పీఎస్ ప్రసాద్, పీఏ రాజు, బి. రామానాయుడు, ఎం. సంజీవరెడ్డి, జి. దేముడు, సలహాదారులు పైలా కృష్ణారావు, సీహెచ్ ప్రసాద్, జి. వీరభద్రరావు, జాయింట్ సెక్రటరీ ఎంవీ సత్యనారాయణ, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

'వరుణ్' సిబ్బంది రక్తదానం

తాటిచెట్లపాలెం: వరుణ్ సంస్థల అధినేత వి.ప్రభుకిషోర్ పుట్టిన రోజు సందర్భంగా ప్రతి ఏడాది వరుణ్ సంస్థల సిబ్బంది రక్తదానం చేస్తుంటారు. దీనిలో భాగంగా శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుమారు 1,314 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. విశాఖలో సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, లయన్స్ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్, ఏఎస్ రాజాబ్లడ్ బ్యాంకులకు కలిపి మొత్తం 825 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. చైర్మన్ ప్రభుకిశోర్ మీద ఉన్న అభిమానంతో చేసినట్లు జీఎం నాగేంద్ర తెలిపారు. అదేవిధంగా క్లీన్ విశాఖ-గ్రీన్ విశాఖలో భాగంగా ఆర్కే బీచ్‌లో గణేష్ నిమజ్జనం సందర్భంగా పేరుకుపోయిన వ్యర్థాలను వరుణ్ సిబ్బంది తొలగించారు. కార్యక్రమాలు హెచ్ఆర్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, జీఎం నాగేంద్రల పర్యవేక్షణలో జరిగింది.



రక్తదానం చేస్తున్న వరుణ్ సిబ్బంది

ఉత్సాహంగా సాగుతున్న వేడుకలు

సీతమ్మధార: ఆశీలమెట్టలో శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయంలో శనివారం శ్రీవ్యాస మహాభారత లిఖిత గణపతి అలంకరణలో సంపత్‌వినాయగర్ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 4 గంటలకు హోమం,అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి ఎంబర్‌మన్నార్ భజన మండలిచే సుందరాకాండ పారాయణం చేశారు.



సుందరాకాండ పారాయణం చేస్తున్న ఎంబమన్నారు భజన మండలి

పలు చోట్ల అన్నసమారాధనలు



అన్నసమారాధనలో పాల్గొన్న కార్పొరేటర్ ముువ్వల లక్ష్మి దంపతులు



అన్నసమారాధనలో పాల్గొన్న ధనలక్ష్మి తదితరులు

ఆరిలోవ: వినాయక నవరాత్రి ఉత్సవాలులో భాగంగా ఆరిలోవ ప్రాంతంలో పలుచోట్ల శనివారం అన్నసమారాధనలు జరిగాయి. తోటగరువు, టీఐసీ పాయింట్ సమీపం, భరత్‌నగర్, ఆరిలోవ పోలీస్ స్టేషన్ సమీపం, దుర్గానగర్‌లలో వినాయక మండపాలు వద్ద అన్నసమారాధనలు చేపట్టారు. దుర్గానగర్‌లో జరిగిన అన్న సమారాధనలో ఆరిలోవ సీఐ సోమశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు పాల్గొన్నారు. ఆయాచోట్ల జరిగిన కార్యక్రమాల్లో పలువురు వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వాల్తేరు బెస్ట్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో..

ఏయూక్యాంపస్: స్థానిక 20వ వార్డు పెదవాల్తేరు కొత్తపేటలో వాల్తేరు బెస్ట్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాగణపతి మండపం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ముువ్వల లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముువ్వల సురేష్, ప్రసాద రెడ్డి, రవి కిరణ్ రెడ్డి, వాల్తేర్ బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మద్ది పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17వ వార్డు ఎస్‌బీఐ కాలనీలో..

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 17వ వార్డు ఎస్‌బీఐ కాలనీలో జరిగిన వినాయక చతుర్థి వేడుకల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు పాల్గొన్నారు. తొలుతా గణనాథుడ్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లవనకుమార్, పిల్లా సత్యవతి, వాసుపల్లి లక్ష్మణ్ , పలువురు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దుర్గానగర్‌లో భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న ఆరిలోవ సీఐ, వైఎస్సార్‌సీపీ నాయకులు

18వ వార్డులో..

ఎంవీపీకాలనీ: 18వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్-9లో అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ పుక్కళ్ల ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీవరసిద్ధి వినాయకుడి ప్రతిమకు పూజలు నిర్వహించారు.

గణపతి మండపం వద్ద హోమం



రాకెట్ వినాయక మండపం వద్ద హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలో గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాకెట్ నమూనా వినాయక మందిరంలో శనివారం లక్ష్మీ గణపతి హోమాన్ని నిర్వహించారు. సాయంత్రం చిన్నారులకు రాకెట్లపై చిత్రలేఖన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

27న ఏపీఈపీడీసీఎల్ వద్ద ధర్నా

మద్దిలపాలెం: పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలపై పిఠాపురం కాలనీలో శనివారం సీపీఎం కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27న గురుద్వారా నుంచి ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యాలయం వరకూ ప్రదర్శన, ధర్నా నిర్వహించనున్నామన్నారు.